# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

| | | |
|---|---|---|
| సంపుటము ౮. | 12 1921 | చందా సం॥ రు ౩. |
| సంచిక ౨౫. | కాకినాడ:—శనివారము, నవంబరు, ౧౨, ౧౯౨౧. | విడిసంచిక అ ౧. |


## ఓమ్.

ప్రాణేశ నీను బాసి నే నెటుల గాలంబు
పుచ్చంగ గల్గుదు ప్రేమ స్వర్గము దక్క ?
నీతోడ నున్నపుడు యుగములు గడియలౌ
నీవు లేకుండిన గడియలు కల్పమౌ
నిను జూడ జూడంగ నిద్రయును. ఆకలియు,
స్థలవిశేషంబును, కాలంబు గడచుటయు,
దలపునకు రా దెపుడు. నీ తేటమాటలే
నా యాకలిని దీర్చు నన్నంబు పరికింప
నీ మందహాసమే నా బాధలను మాన్ప
తగినట్టి యౌషధము నీ కౌగిలింతలో
నన్నంత కాలమును శత్రు భయమునుగాని,
మిత్రప్రేమను గాని, మృత్యుసూతను గాని,
మది నెంచగను రాదు మఱి విశ్వమంతయు,
మఱచి పోవుటయును, మదిని పోరాటముల్
సమసి పోవుటయును, మించిన యానంద
మనుభవించుటయును, మితిలేని సౌఖ్యముల్
యెదను తలపోయకయే, మదిని శాంతిని జెంద
యుత్సాహమును విడసి మఱి మఱి నినుజేరి
నా ప్రాణమును నీకు ప్రీతితో నర్పించి
నీ ప్రేమ ~~సుధ~~ గోల నే దప్పిగొనుచుందు.

ఇ. సు. కృ.

---

యథార్థమైన పాప విమోచనము ఈ బాహ్య కార్యములచే కలుగజాలదు. పాపము మనస్సునకు సంబంధించినది. తాపజ్వరము పై శీతలోపచారములచే నుపశమింప జాలదు. తగిన ఔషధము లోపల పడినపుడే అది శాంతించును. అట్లే పాపరూపమయిన ఈ మనోజాడ్యము గూడ అంతరంగిక సాధనముల మూలముననే నిర్మూలింప వలెను. హృదయమునందు మార్పు కలిగింపజాలని దాన, వ్రత, ఉపవాసాదుల వలన ప్రయోజనము లేదు. లంచ మిచ్చి భగవత్ప్రీతిని బడయ జాలము. ధన వ్యయముచే పాపక్షయము కానేరదు. పాపమనగా ఈశ్వరాజ్ఞాధిక్కారము. చెంతజేరి భగవంతుడు చేసెడు హితోపదేశముల బుద్ధిపూర్వకముగా నిర్లక్ష్యము చేసి మనము పాపము నొడిగట్టుకొను చున్నాము. మన తండ్రియు, తల్లియు, హితుడును క్షేమాభిలాషియు నగు పరమేశ్వరుని సదుపదేశములను పెడచెవిని బెట్టి నందులకై గాఢమైన పరితాపమును పొందమేని ఆ పరాత్పరుని హితముల నికమీదనైన శిరసావహింప సంసిద్ధ పడమేని మన బుద్ధిని చక్కపరచుకొని ధర్మమార్గమున చరింపమేని మన మెట్లు పాప విముక్తులము కానేర్తుము.?

(విజ్ఞానవల్లరి.)

---

గీ. చూచుచుండుము చూపుల చోద్య మొకటి
గాంచుచుండుము గాన్పుల గాంతి యొకటి
నడుచుచుండుము నడపుల నటన మొకటి
జీవకళతోడ మెఱుమును జిత్రమదియె.

Tennyson.

వే. వెం.

---

# ప్రార్థన యొక్క ప్రయోజనము.

—:o:—

"ప్రార్థన ప్రయోజనకరమా" అన్న సందేహము పల్వుర హృదయమును వేధించుచున్నది. ఇట్టి సంశయమునకు కారణము లేకపోలేదు. విజ్ఞానము యొక్క సాహాయ్యముచే మనము నేడు సమస్త భౌతిక జగత్తును అనుల్లంఘనీయములగు నియమములకు లోనైయున్నదని గ్రహించినారము. ఆ నియమములను పాటింపక పోయినచో మనము ఈప్సితార్థ సిద్ధిని బడయజాలము. మన పొలము చక్కగా పండవలెనన్న మనము చేయవలసిన దేమి? భూమి సారవంతముగా లేనిచో మంచి యెరువు తోలవలెను. భూమిని బాగుగా దున్నవలెను. మంచి విత్తనములను చల్లవలెను. చక్కగా నీరు కట్టవలెను. ఇవ్విధమున తగిన కృషి చేసినచో పంట పండుననుటకు సందియము లేదు. కాని యిట్టి ప్రయత్నము లెవ్వియు చేయక తన క్షేత్రము చక్కగా ఫలింపవలయునని మ్రొక్కులు మ్రొక్కువాడు మంచి పంటను పొందజాలడు. భౌతిక జగత్తున నెట్లు శాశ్వతములగు ధర్మములు రాజ్యము చేయుచున్నవో అట్లే ఆధ్యాత్మిక జగత్తున గూడ అనతిక్రమణీయములగు నియమములు కలవనియు, తద్ధర్మముల ననుసరించుటయే మనకు కావలసినది గాని ప్రార్థనలు గావనియు కొందఱందురు. భౌతికజగత్తేమి, ఆధ్యాత్మిక జగత్తేమి శాశ్వతములగు ధర్మములకు బద్ధమైయుంటచే, ప్రార్థన అనావశ్యకమును, వృథా కంఠశోషయు నగుచున్నదని వారు అధిక్షేపింతురు. ఈ ఆక్షేపణల యొక్క సారాసారములను మనము పరీక్షింపవలెను. ఇపుడు మనము ఆలోచింపవలసిన విషయములు రెండు. ప్రార్థన ఆవశ్యకమా అనునది యొకటి. ఆవశ్యకమైనచో ప్రార్థనకును ఈశ్వర శాసనములకును వైరుధ్యము గలదా యనునది మఱి యొకటి.

ప్రార్థన అనగా వేడుకొనుట. ఏదో అక్కఱ కల్గిన గాని వేడుకొనుట తటస్థింపదు. కావున 'ఇది నాకు కావలెను' అని తలంచునట్టి ఒక పదార్థము గలదని మనము ముందుగా అంగీకరింపవలసియుండును. అనగా ఆత్మయొక్క ఉనికిని మనము ప్రథమమున ఒప్పుకొనవలసి యుండును. తన కేదియో యొకటి కావలయునని కోరునట్టి ఆత్మయే లేదన్నచో ప్రార్థనకు ఆవశ్యకతయే యుండదు. మనము నడచినపుడు, మనము చూచినపుడు, మనము విన్నపుడు, మనము ఆస్వాదించినపుడు, మనము స్పర్శించినపుడు, మనము ఆఘ్రాణించినపుడు ఎట్లు మనకు భిన్నమైన భౌతిక ప్రపంచ మొకటి యున్నదని నమ్ముచున్నామో అట్లే మనము చింతించినపుడు, మనము ప్రేమించినపుడు, మనము, అసూయ చూపినపుడు, మనము సంకల్పించినపుడు, వికల్పించినపుడు, మనము జ్ఞాపకము పెట్టుకొన్నపుడు, మఱచిపోయినపుడు, ఈ నానావిధ వ్యాపారములకును మూలాధారమైన ఆత్మ యొకటి కలదని గూడ మనము విశ్వసించుచున్నాము. శారీరక వ్యాపారములకు ఒక భౌతిక జగత్తును, శరీరమునకు కొన్ని అక్కఱలును ఎవ్విధముగా నేర్పడియున్నవో అవ్విధముననే ఆత్మయొక్క వ్యాపారములకును ఒక ఆధ్యాత్మిక జగత్తును, ఆత్మకును కొన్ని అక్కఱలును గలవు. ఆత్మయొక్క అభావములు పరమాత్మతోడి సంబంధము వలన గాని అన్యమార్గమున తీఱజాలవు. పరమేశ్వరుడు మన పరమ జనకుడు. మన ఆత్మీయ వాంఛలను అతడే తీర్ప గలవాడు. ఇక అతనిని ప్రార్థింపక జీవించుటెట్లు? ఆకలి దప్పి తీఱవలెనన్న భౌతిక ప్రపంచమును ఆశ్రయింపక యెట్లు వీలు లేదో మన ఆధ్యాత్మిక క్షుత్తృష్ణలు తీరవలెనన్న భగవంతుని సమీపింపక వీలు లేదు. అందుచే ఆత్మ పట్టున ఈశ్వర ప్రార్థన మిక్కిలి సహజమైన వ్యాపారమే యగుచున్నది.

ప్రార్థన ఆవశ్యకమైనచో అయ్యది ఈశ్వర శాసనమునకు విరుద్ధమగునా? అను సంశయము తరువాత ఆలోచనీయము. మనుష్యుడు అనగనే మనకు రెండు భాగములు స్ఫురించును. పాంచభౌతికమైన దేహ మొకటి. తద్విలక్షణమైన ఆత్మ యొకటి. ఈ రెంటిని బట్టి అతని యొక్క అభావములును రెండు విధములు. కావున అతని ప్రార్థనలును ద్వివిధము. మనము శారీరక అభావముల కొఱకును ఆధ్యాత్మిక అభావముల కొఱకును ప్రార్థన చేయుచుందుము. భౌతిక జగత్తునకును మానసిక జగత్తునకును ఒక్కడే అధిపతి. అతడే మన సకల విధములైన కోర్కెల తీర్చువాడు. ఏ విషయమునవైనను అతనిని సమీపించి ప్రార్థించుటకు అధికారము గలదు. తండ్రిని జేరి మన మనోగతములను వెల్లడించుటకు మన కెట్లు చనవును హక్కును గలదో, అట్లే పరమపితయగు భగవంతుని చెంతకేగి మన అక్కఱలను నివేదించుటకును మనకు స్వాతంత్ర్యము గలదు. కాని జ్ఞాన మధికమయిన కొలది మన ప్రార్థనలు మారక తప్పవు. యీ లోకములో కుమారులు తండ్రిని అడుగు వస్తువులు గూడ జ్ఞానాభివృద్ధిని బట్టి మాఱ్పు చెందుచుండును. అక్రమములును, అసాధ్యములును, అనావశ్యకములు నగు ప్రార్థనలు క్రమక్రమముగా తగ్గిపోవును. కాని యీసందర్భమున ఒక్క సంగతిని మాత్రము మనము జ్ఞప్తియందుంచుకొనవలెను. ప్రార్థనలో రెండు సంగతులు ఇమిడియున్నట్లు చూడగనే స్పష్టమగుచున్నది. ఒకటి అక్కఱను తెలిసికొనుట. రెండు దానిని తీర్పవలెనని భగవంతుని కోరుట. కాని యింకొక విశేషము కలదని మనము గ్రహింపవలెను. ఆ అక్కఱను తీర్చుకొనుటకు సరియైన మార్గమున పాటుపడుట గూడ ప్రార్థనలో జేర్న మరియొక యంశమని మనము తెలిసికొనవలెను. అడుగగనే తన పని తీరిన దని తలంచెడు ప్రార్థనాశీలుడు సఫల మనోరథుడు కాజాలడు. యథార్థమైన భక్తుడు ప్రార్థన చేసి చేతులు ముడుచుకొని కూర్చుండడు. యథార్థ భక్తుడు సోమరిగాడు. నిరంతర కార్య పరతంత్రుడు. అభావమును గ్రహించుటయు, ఆ యభావమును తీర్చుకొనుటకై తగిన మార్గమున కృషి చేయుటయు, ఆ యభావమును యీశ్వరునికి నివేదించుటయు ప్రార్థనలో నిమిడియున్న భాగము లని తెలిసికొంటిమి. యీ సంగతుల మనస్సున నిడికొని ప్రార్థనకును యీశ్వర శాసనములకును వైరుధ్యము గల దేమో పరిశీలింతము.

మనము మన దేహారోగ్యమునకును దేహపుష్టికిని కావలసిన విషయముల గూర్చి ప్రార్థన చేయుచుందుము. దినదినమును ఆహారమును మన కొసంగగలవాడు పరమేశ్వరుడే. ప్రపంచములోని ఒక్క అణువునైనను మనము సృజించియుండలేదు. కేవలము మన ప్రయత్నముల చేతనే ఒక్క మొక్కనైనను మొలిపింపజాలము. ఒక్క పూవునైనను పుష్పింపజేయజాలము. ఒక్క కాయనైనను కాయింపజాలము. ఒక్క పండయినను పండింపజాలము. అట్టి సందర్భములో మన దేహపోషణకు వలయు వస్తువులను గూర్చి అతని ప్రార్థించిన తప్పేమి? ప్రార్థన మూలమున మనము అతనిమీద ఆధారపడియున్నామని తెలియజేసితిమి. ప్రార్థించి యూరకొనరాదు. ఆహారమును పొందుటకు చేయవలసిన కృషి చేసి ఈశ్వరాజ్ఞను పాలించిన వారమే యైతిమి. ఆరోగ్యము నియ్యమని ప్రార్థించుచు అనారోగ్యకరములగు పదార్థములను భుజించువాడు, దేహబలమును ఒసంగుమని ప్రార్థించుచు కాళ్లు కదల్పక యొకచో కూర్చుండువాడు, అన్నము పెట్టుమని కోరుచు పాటుపడక సోమరియై తిరుగువాడు, యథార్థ ప్రార్థనాశీలుడు గాడు. అయితే ప్రార్థన చేసిన ఆధిక్యమేమి? ప్రార్థన చేయకపోయినను పాటుపడువాడు తన కోర్కెను నెరవేర్చుకొనుచున్నాడు గదా? ప్రార్థనాపరుడు ఈశ్వరుని జ్ఞప్తి చేసికొని తనకును ఈశ్వరునకును గల సంబంధమును దృఢము చేసికొని, యెక్కువ సంతోషమును తృప్తిని అనుభవించుచున్నాడు. ప్రార్థన చేయనివాడో అహంకారియై వినయశూన్యుడై ఈశ్వరునికి దూరమగుచున్నాడు.

ఇక ఆత్మీయ విషయముల గూర్చి మనము చేసెడు ప్రార్థనల గూర్చి చూతము. మన ప్రార్థన యొక్క లక్ష్యమేమి? ఈశ్వర జ్ఞానమును బడయుట, ఈశ్వరుని ప్రేమించుట, ఈశ్వరాజ్ఞలను పాలించుట, ఈశ్వరేచ్ఛ మన యిచ్ఛలను నైక్యము చేయుట, బ్రహ్మ తేజస్సును మనలో నుద్దీపింపజేయుట మన లక్ష్యము. యీలక్ష్య సాధనమున మనకు తోడ్పడుట కంటె, యీమన మనోరథమును సఫలీకృతము చేయుట కంటె యీశ్వరునికి మరియొక ఉత్తమవ్యాపారమేమి కలదు? యీయైక్య సంధానమునకై మన కంటె వేయి మడుంగులు అధికముగా అతడే పాటుపడుచున్నాడు. ఎన్నడు మనము తనతో సంపూర్ణైక్యమును చెందుదుమా యని అతడే తపించుచున్నాడు. కాని యీయైక్య మెట్లు సాధ్యమగును. అహము అడుగు అడుగునకు అడ్డుపడుచున్నది. అహము అడగిపోయిన గాని యీశ్వరదర్శనము కలుగజాలదు. ఇందులకు ప్రార్థనకంటె శ్రేష్ఠతరమైన ఉపాయమేమి? చేతులు మోడ్చి, ఉల్లంఘించిన ఆజ్ఞలకై పరితాపమును చెందుచు తప్త హృదయులమై కన్నీరు కార్చుచు, "స్వామీ నా అహంకారమును అడగద్రొక్కి నన్ను చక్కపఱచి, నీ వాడనుగా నన్నేలు కొమ్మ" అని ప్రార్థన చేయుటవలన గాక యీశ్వరునితో సాంగత్యమెట్లు సాధింపగలము? యీ ప్రార్థనా విషయమున గూడ యీశ్వర శాసనమును గౌరవించి, అనుసరించిన వారమే యగుచున్నాము.

అన్యుల శ్రేయస్సు నిమిత్తమై ప్రార్థన చేయునపుడును మనము మీఱు ధర్మశాసనము లెవ్వియును లేవు. యీశ్వరుడు సర్వజనుల క్షేమాభిలాషి. ఆయన యిచ్ఛకు విరుద్ధముగా మనము ప్రార్థించుటలేదు. ఎప్పుడు ప్రార్థించినను యీశ్వరాజ్ఞాపరిపాలనమే మన యుద్దేశము. ప్రార్థన మూలమున మన అంతశ్శక్తులను నిద్రనుండి లేపుచున్నాము. "తత్స వితుర్వరేణ్యం । భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్" తేజస్స్వరూపుడగు అతని ధ్యానమువలన గాక మన బుద్ధిశక్తు లెట్లు తేజోవంతములు కానేర్చును? సంశయపడవలసిన అగత్యము లేదు. మన మనోరథములను చెల్లించుటయే ఆయన యొక్క యుద్దేశము. మనలను తన వైపునకు ఆకర్షించుకొనుటకే ఆయన యేర్పాటు చేసిన ఒక మనోహర నియమమే ప్రార్థన. ప్రార్థన యొక్క అమోఘశక్తిని గుర్తించి మాటి మాటికిని ఆయన చెంత చేరుచు, జీవితములోని సకల వ్యాపారములను యీశ్వర ప్రార్థనా రంజితములుగా జేయుచు ధన్యాత్ములమయ్యెదము గాక!

పా. న.

---

# సమాచారము.

మహమ్మదీయులు ఖద్దరు, రాట్నములు వాడుటలో వెనుకబడియున్నారు. వారిలో వానిని వ్యాపనము చేయుటకు చోటానిగారు స్వరాజ్యనిధికి ౧౦౦౦౦ రాట్నముల దానము చేసిరి. మరియు లక్ష రాట్నములు తక్కువ ధరకు నిచ్చెదమనియు తెలిపిరి. సొమ్మంతయు రాట్నముల కొరకె ఖర్చు పెట్టక అందులో కొంత పేదస్త్రీలు వడికిన నూలు కొనుటకు వినియోగము చేయ గాంధి మహాత్ముడు సలహా నిచ్చెను.

మహాత్మా గాంధిగారు చేయు బోధనలు ఏ విషయమునను వ్యర్థముగ పోవుట లేదు. మహాకాంత ఏజన్సీలో దంతాసంస్థానమున వారి ప్రయత్నముల వలన జంతు బలి ఆపివేయబడెనట.

దేశీయ మహాజన సభ స్థాయి సంఘము ౪ వ తేదిన ఢిల్లీలో సమావేశమయినది. శాసనోల్లంఘన తీర్మానము అంగీకరింపబడెను. ఏ రాష్ట్రము వారు ఆ రాష్ట్రమునకు తగినటుల శాసనోల్లంఘనము ప్రారంభింతురు. పదునేను దినములలో గుజరాతునందు శాసనోల్లంఘనము తాము ముందుగ మొదలిడెదమనియు, దాని ఫలితమును జూచి యితర రాష్ట్రములవారును అందునకు పూనదగుననియు మహాత్మా గాంధి సభలో తెలిపిరి.

బ్రాహ్మసమాజము.

దీపావళి పండగ.

గోళాబంద బ్రాహ్మసమాజము తరఫున అక్టోబరు ౩౦ తేది ఆదివారము ఉదయం ౭ గంటలకు ప్రార్థన సల్పి సాయంకాలము ౬ గంటలకు నగరసంకీర్తన జేయుచు బీదలకు వస్త్రదానము సమర్పించబడినది. కష్టమనక ఆదిఞ లింగరాజులు గారు బరంపురం నుండి వేంచేసి నాతోకూడ నగర సంకీర్తన సల్పిరి. యిట్టి కార్యములకు యీ పరమదయాళుడే సహాయుడని నమ్ముచున్నాము. యిట్టి కార్యములకు యీ పరాత్పరుడు మా హృదయములందు పురికొల్పింప జేయగలందులకు ప్రార్థించుచున్నారము.

కేశవసాహు, కార్యదర్శి.

సత్యమేవ జయతే

ధర్మసాధని

శనివారము, నవంబరు, ౧౨, ౧౯౧౦.

## సాధ్వి జదుమోహిని దేవి.

———:o:o:———

"Just the night before her death, she said, that she saw Keshub dancing before her eyes and beckoning her into the land of the immortals."

"ఆమె చనిపోవుటకు ముందటి రాత్రి తన కన్నులయెదుట కేశవచంద్రుడు నృత్యము చేయుచు తనను అమర ధామమునకు ఆహ్వానించినట్లు చూచితి నని చెప్పెను."

ఈ సాధ్వీమణి వంగ దేశమునకు జెందినది. తన ౬౫ వ యేట అక్టోబరు ౧౯ వ తేదిన పరలోకగతురాలాయెను. మరణమునకు పూర్వము ఆమె వచించిన పై మాటలు అతి గభీరములుగ నున్నవి. వానిని బట్టి ఆమె జీవితము ఎంత పవిత్రమయి యుండెనో యూహింప నగును.

భక్తాకేసరుడు, బ్రహ్మానంద కేశవచంద్రుడు ఆమెకు ౧౩ వ యేట ఉపదేశము చేసెను. ధర్మజీవనమునందు ప్రవేశ మొసంగెను నాడు ఆ మహనీయుడు గావించిన యుద్బోధనమును ఆమె మరణ పర్యంతము మరవ లేదు; విడువ లేదు. చనిపోవుటకు పూర్వము కేశవచంద్రుడు నృత్యము చేయుట ఆమె స్మరణకు వచ్చెను. ఆతని భక్తి ఆమెను సంపూర్ణముగ వశము చేసికొనెను. అతడు ఆమెకు మార్గదర్శకుడు. ఆదర్శప్రాయుడు ఆయెను. ఆతనిని సదా మనస్సున లక్ష్యముగా నుంచుకొని ఆమె తన జీవనమును దిద్దుకొనెను. భర్త బ్రాహ్మసమాజమున చేరి చేసిన ఘనకార్యములందు, పడిన గొప్ప కష్టములయందు చేదోడుగా నుండెను. ఆర్గురు కుమారుల, ఇరువురు కుమార్తెల తల్లియయి పెద్ద కుటుంబమును నిర్వహించెను. గృహ కృత్యముల గావించుచు సంఘ బహిష్కారము వలన కలుగు బాధల సహించుచు ప్రియాసతో జీవనము గడపుచు భక్తియందు పెంపొందుటకు ఆమెకు సాయపడినది యేమి? విద్యాలయములందు ఆమె శిక్షితురాలు కాలేదు. గొప్ప విద్వాంసురాలని పేరు పొందలేదు. జ్ఞానమునందు ఏ గొప్ప యాధిక్యతయు బడయలేదు. కాని ప్రకృత విద్యాలయములందు పఠించి విద్వాంసు రాండ్రని ప్రఖ్యాతి గాంచిన నారీమణులకు లభింపని యుత్తమ జీవనము ఆమె సంపాదింప గలిగెను. ఆమెకు గురువు లేక పోలేదు; శిక్షణము లేక పోలేదు; యథార్థమయిన జ్ఞానమును లేక పోలేదు. కేశవచంద్రుడు ఆమె గురువు; ఆతడు చేసిన యుపదేశమె ఆమె శిక్షణము; ధర్మమును గోచరింప జేయు విజ్ఞానమె ఆమె జ్ఞానము. మనకు విద్య యనగానె మన ప్రకృత విద్యాలయములు, అందలి మాష్టర్లు జ్ఞప్తికి వత్తురు. ధర్మ జీవనమున ప్రవేశ మొసంగు విద్యయె విద్యయను సంగతి మనము మరచితిమి.

అపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోధర్వవేదః శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి । అథపరా యయా తదక్షర మధిగమ్యతే ।

అని ప్రాచీనార్య ఋషులు నుడివిన సత్యము స్మరింతుము గాక! ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము, శిక్షణము, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము, మొదలగునవి శ్రేష్ఠవిద్యలు గావు, దేనిచేత నాశరహితుడైన పరమేశ్వరుని గ్రహింప నగునో అదియె శ్రేష్ఠమయిన విద్య, అను మన పూర్వుల యుత్కృష్టాదర్శము మన మనస్సులనుండి పూర్తిగ తొలగించి. ఏవి శ్రేష్ఠములు గావో అవియే శ్రేష్ఠములని భావించి యభ్యసించి ఘనుల మని గర్వించు మన స్థితి అత్యంత శోచనీయము. సాధ్వి జదు మోహిని దేవి శ్రేష్ఠవిద్య నభ్యసించెను. సర్వోత్కృష్ట పదవి బడసెను.

కేశవచంద్రుని శిక్షాప్రభావముచే యెందరో పురుషులు, స్త్రీలు ఇట్టి యాత్మోన్నతి బడసిరి. రవంత అగ్ని ఏ మూల నున్నను, సర్వమును దహింప జేయును. భక్తి ఒకని యందుండిన దశ దిశల గ్రమ్మి చుట్టుప్రక్కల నున్న వారందరి జీవనముల సంస్కరింప గలుగును. తన సాధన విశేషమున, ఈశ్వరానుగ్రహమున, కేశవచంద్రుడు భక్తాగ్రేసరు డయ్యెను. ఆతని ప్రసంగములు, ఉపదేశములు, నృత్యములు భక్తితో ప్రజ్వలించెను. అనేకులా భక్తి స్పర్శమున ధన్యులైరి. ఇతరులకు భక్తి లేదు, అని తరచు అనుకొనుచు మనము ఆ తృప్తి జెందుచుందుము. అసలు ఏ యొక్కరిలో భక్తి యున్నను, అది దావానలము వలె అంతట వ్యాపించక యుండగలదా యనియు, నిజముగా తనలో నైన భక్తి యున్నదా యనియు పరీక్షించుకొను వారు గానరారు. బ్రాహ్మసమాజమున జను మోహిని దేవి వంటి సాధ్వీమణులును, పురుష పుంగవులును ఉండుటకు కారణము కేశవచంద్రుని వంటి భక్తవరులు గురువులై సామాజికులకు సరియయిన శిక్షణ మొసంగుటయే. గంటకు ఒకరు చొప్పున మారెడు మాష్టర్లమూలమున దేశోద్ధరణము కాజాలదు. శిష్యుల యాజ్జీవనము పాలనము చేయగల మహాత్ములె యథార్థమయిన గురువులు. పతనము నొందిన భారతీయుల నుద్ధరించుటకు పతితోద్ధారకుడు, పరమేశ్వరుడె జగద్గురువులని సహితము ప్రశంసింప దగిన మహాపురుషులను వారి నడుమ జన్మింప జేయుచున్నాడు. అట్టి మహనీయుల గాంచుచు భరతవర్షము యొక్క భావ్యభ్యుదయమును గూర్చి ఎట్లు శంకింప గలము?

---

టి. వి. శేషగిరి అయ్యరుగారి చట్టములు:—

టి. వి. శేషగిరి అయ్యరుగారు ఢిల్లి శాసనసభలో స్త్రీలకు సంబంధించిన రెండు చట్టములు ప్రవేశ పెట్టుటకు ప్రయత్నించిరి. మొదటిది అంగీకరింప బడలేదు. రెండవది అంగీకరింప బడెను. సభా వ్యవహారములను బట్టి 'ఏమైన నేమి ప్రభుత్వము వారు అస్మదాదులు చేయు ప్రయత్నములకు సానుభూతి జూపసమకట్టి యుండలేదు' అని అయ్యరుగారు నిరాశ జెందిరి. ఆ శాసనములను గూర్చి ప్రజాభిప్రాయానుసారముగ్గా యభిప్రాయ ముండునని దొరతనము వారు చెప్పుటచే, దేశములోని పురుషులు, స్త్రీలు, ఎల్లరు తమ యభిప్రాయముల తెలిపి తోడ్పడ వలయునని అయ్యరుగారు గోరుచున్నారు. ఆ శాసనముల యుద్దేశము యీ క్రింద పొందుపరచు చున్నాము.

I. వారసత్వ నిషేధ శాసనము.

విరుద్ధముగ హిందూ ధర్మశాస్త్రములో నెట్టి సూత్రము న్నను, ఆచారము లున్నను, హిందూ ధర్మశాస్త్ర బద్ధులగు వారు ఉమ్మడి కుటుంబపు ఆస్తిలో వారసత్వమునుగాని, భాగమును గాని, రోగపీడితుల గుట చేతను, అంగవైకల్య ముంటచేతను, మనోవైకల్య ముంటచేతను నిషేధింప బడ గూడదు.

ఈ చట్టము బెంగాలులో తప్ప అన్ని రాష్ట్రములలోను వర్తింపవలయును.

2. హిందులా సవరణ చట్టము.

తద్విరుద్ధముగ హిందూలాలో నేమియున్నను, భాగము లేమియును లేని హిందువుల ఆస్తికి, వాని సోదరుని మనుమని వరకును వారసులు లేనిపక్షమున వరుసగా కొడుకు కూతురును, కూతురు కూతురును, భగినీ పుత్రికను, భగినికిని, వైమాతుర భగికిని, తత్పుత్రికను, సవతి తల్లికిని చెందవలయును. పై చెప్పిన వారెవరును లేని పక్షమున తండ్రి తల్లివైపు వారికిని యితర వారసులకును మితాక్షర వారసత్వ న్యాయప్రకారము చెందవలయును. కాని మామూలు హిందూలాప్రకారము స్త్రీ వారసురాలు అనుభవించు ఆస్తినే పై జెప్పిన ప్రకారము స్త్రీ వారసత్వము వచ్చినవారు అనుభవించ వలయును.

ఇందువలన ప్రత్యేక కుటుంబాచారములు గాని స్థానికాచారములు గాని మార్పు జెంద నక్కర లేదు.

---

సనాతన హిందూ ధర్మము:—

ఈ విషయమై మహాత్మా గాంధి చేసిన వ్యాఖ్యను శంకించుచు వారి కొకరు విమర్శన పంపిరి. చర్చ నిమిత్తము గాక తమ యభిప్రాయములు తెలుపుటకె అ వ్యాసము ప్రకటించితి ననియు, వానిని గూర్చి తర్కించుటకు తమ కిపుడు అవకాశము లేదనియు, అవి సరిగాదను కొనువారు తమ్ము బహిష్కృతునిగ భావించిన భావించ వచ్చుననియు, విలేఖకునికి గాంధి మహాత్ముడు ప్రత్యుత్తర మిచ్చెను.

---

# లేఖలు.

## సన్మాన సభ.

ధర్మవర మాధ్యమిక పాఠశాలయందలి ప్రధానోపాధ్యాయులగు బ్రహ్మశ్రీ కురిడి రంగారావు బి. ఏ. గారును, వ్యాయామోపాధ్యాయులగు మ॥ రా॥ శ్రీ కె. పుట్టయ్యగారును, కారణాంతరముల వలన స్థలాంతరములకు వెళ్ళుచుండగా వారి గౌరవార్థమై ౧౯౨౧ వ సంవత్సరము నవంబరు నెల ౨ వ తేది సాయంకాలము 4½ గంటలకు పాఠశాలాభవనమున విద్యార్థి వాఙ్మయ సంఘము సమావేశమయ్యెను. ఈ సభకు జడ్. దేవిడ్ బి. ఏ. ఎల్. టి గారగ్రాసనాధిపులుగా నెన్నుకొనబడిరి. ప్రారంభమున ఎన్. నారాయణస్వామి యను విద్యార్థి ఈశ్వరప్రార్థనా పద్యములను మనోహరముగా జదివెను. అగ్రాసనాధిపుల ప్రారంభోపన్యాసానంతరము ఎ. సదాశివన్, కె హనుమంతరావు, ఎన్. రామారావు, ఎన్. నారాయణస్వామి, ఎస్. ఆది శేషప్ప, ఆర్, నారాయణస్వామి, శీరిపి అచ్చమాంబిక (తొమ్మిదేండ్ల బాలిక) మున్నగు వారు ప్రధానోపాధ్యాయుల వారియు, వ్యాయామోపాధ్యాయుల వారియు గుణగణములను గూర్చి వర్ణించుచు నుపన్యసించిరి. ఉపాధ్యాయుల పక్షమున మ॥ రా॥ శ్రీ బి. అప్పస్వామిగారు కొంత వరకు మాటలాడిరి. పిమ్మట విద్యార్థుల పక్షమున మా పాఠశాల యందలి యాంధ్ర పండితులగు మ॥ రా॥ శ్రీ శీరిపి ఆంజనేయులుగారు సన్మానపత్రమును జదివి వినిపించిరి. అందలి పద్యము లీ పత్రిక యందు వేరొక భాగమున ముద్రింపబడినవి. అగ్రాసనాధిపులు మనోభిరామముగ తమ యంత్యోపన్యాసమును గావించిరి. బాలకులకు దినుబండములు పంచిపెట్ట బడినవి. తదుపరి యుపాధ్యాయుల కాతిథ్య మొసగబడినది. కృతజ్ఞతావందనములతో సభ ముగిసినది.

కె. హనుమంతరావు,
కార్యదర్శి.

## పద్యములు.

శా. శ్రీలన్ బ్రేమ వహింప, విశ్రుత యశ
శ్శ్రీ జెందఁ, బట్టం బొగిన్
గేల్ దాల్చి, స్వధర్మ నిర్వహణమున్
గీర్తి ప్రసిద్ధంబుగా
నోలిన్ బూన్చి, యభేద మానసుఁడవై
యొప్పొందినా వద్ది! సౌ
ఖ్యాలికి జెందు మజస్ర మీశుకృప వా
ర్యా! రంగరా యాభిదా!

చం. ప్రమదము లేదు సుంతయును
భాగ్యవిహీనుల మైతి మెంతయున్
విపుల కళాధురంధరులు
విస్తృత శాంత గుణ ప్రపూర్ణులున్
మము నెడఁబాసి పోవుట—స
మంజస కర్మ నశించుచుంట—నే
మములు దొలంగుచుంటయు—న
మంగళ సూచనయో! మరేమియో!

సుగంధి.

వేంకటేశుఁడన్ గురుండు వీడె మమ్ముఁ దొల్త, నా
వంకఁ దీర్ప రంగరాయ వచ్చితీవ, మాకు ని
శ్శంకఁ గూర్మిఁ జాల బోధ సల్పినాఁడ వంతె; మ
మ్మింకఁ బైకి దెచ్చు పుణ్యు లెట్టి వారలో కదా?

తే. ఎట్టి వారైన గుణము గ్రహించి,
వారి—కడఁగి, యిష్టార్థ సిద్ధికై జడతమూ,
నిరత గ్రంథానలోకన నియతిఁ జేసి,
ఫలము గాంచెద మాంధ్రాంగ్ల భాషలందు.

తే. కాని సత్ప్రవర్తనమును గాంచునట్టు
లాంగ్ల భాషా ప్రపంచంబు నరయునట్లు
లాంధ్ర సారస్వత జ్ఞాన మందినట్టు
లింపుమై మమ్ము నాశీర్వ దింపుమయ్య.

పంచపాది—ఇట్టి మాన్యుండ వగుట నెందేని నమతఁ
గల్గుటం జేసి పూజ్యతఁ గాంతువయ్య! భక్త
వత్సలుఁ డారోగ్య భాగ్యమున్, జిరాయువు
సిరియు నొసగి, సుఖాబ్ధి నోలలాడఁగా జేసి,
మిమ్ముఁ గాపాడఁ గాత!

మదన దర్పణము.

వీర్యసహిత మానసుండవై విశారదుండవై
కార్యవిజయ కారణుండవై గభీరమూర్తివై
ధైర్యగుణ సమంచితుండవై దయాన్వితుండవై
యార్య! కురుడి రంగరాయ వర్య! యొప్పు
మెంతయున్.

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
*Promptly and Neatly*
*executed.*



# ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1. కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.



# కేనోపనిషత్తు.

ఆంధ్ర పద్య కావ్యము.

శ్రీ ఆదిపూడి సోమనాథరావు కవి ప్రణీతము.

ఈ క్రింది విలాసమునకు రు ౦-౨-౬ పోస్టు బిళ్లలు పంపిన, పుస్తకము పోస్టు ద్వారా పంపబడును.

"ధర్మసాధనీ కార్యస్థానము" కాకినాడ.






# ఫౌంటెన్ కలము.

1. "బ్లాకు బర్డు" ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో — రు. 3- 0-0
2. "హార్డు వేరు" ,, 14 ct ,, — 2- 8-0
3. "శ్వాన్" ,, 14 ct బంగారు పాళీతో కలది. ప్రశస్తమైనది — 5- 8-0
4. "వాటరుమెన్ ఐడియల్" ఫౌంటెన్ పేనా 14 క్యారెట్ల బంగరు పాళీ కలది. మిక్కిలి నాణ్యము — 7- 0-0
5. "ప్రీమియరు" ,, 14 ct బంగారు పాళీతో ,, — 5- 8-0

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునప్పుడు, సన్నపుపాళీ కావలెనో, ముదుగుపాళీ కావలెనో వ్రాయవలయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్సిలు ద్వారా పంపుదుము. కావున, దూరమునందున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసుకు వ్రాసికొనవలెను.

ఎమ్. హెచ్. రావు అండు సన్సు, తపాలాపెట్టె నెం. **29**, కాకినాడ.



# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజాపూరు.

పన్నీరు—ఈ పన్నీరు అర అవున్సు బుడ్డిలో అమ్మబడును. ఈచిన్న సీసాలోనున్న పన్నీరును 3 పెద్దబుడ్ల మంచినీళ్ళలో కలిపినయెడల మొత్తటికి మొం 3 బుడ్ల పన్నీరవును. మేలైన పన్నీరు. వెల బుడ్డి 1 కి అణాలు 8. వి. పి. శెలవు 1 మొదలు 6 బుడ్లవరకు అణాలు 8 ప్రత్యేకము.

కస్తూరిచేర్చిన లావండర్ వాటర్.

మాయొక్క ఔషధశాలయందు తయారుచేయబడిన మిక్కిలి సుఖమైన ద్రవ్యం సీమలోనుంచి రప్పించి అమ్మేటటువంటి వస్తువు కాదు. యెటువంటి వర్లునున్ను మైకపరిచేటటువంటి సువాసన గలిగినది. వస్త్రములను వుపయోగించినా ఇంపైన సుగంధమును నిచ్చును. యీసుగంధమును 4 బొట్లు వుపయోగించినాగాని అంగళ్ళయందు సాధారణమైన అమ్మే లావండర్ వాటర్‌నిన్ని 20 బొట్లు వుపయోగించిన యెటువంటి సుగంధముండునో దానికన్న జాస్తిగాను మాయొక్క లావండర్ వాటర్ మనోరమ్యమైన సువాసనను ప్రబలింప జేసేది గాకుండా మరిన్ని వుపయోగించిన వార్ల చుట్టున్ను చాలాసేపు పరిశుద్ధమైన పరిమళమును ప్రబలింప జేయును. ½ అవున్సు శీసాలయందు విక్రయింపబడును. కకీను సీసా 1 కి అ. 8. వి. పి. కర్చు 1 మొదలు 6 సీసాలవరకు అణాలు 8 ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లిగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనే వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ |
|---|---|---|
| 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు,
బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫ్రిరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మద్రాసు.

## వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులుగారి

## అమృతామలక తైలము.

శిరస్సును కండ్లను సర్వదా కాపాడును. అన్నివిధ శిరోరోగములను బోగొట్టును. పార్శ్వనొప్పులను దూరము జేయును. కణతనొప్పులను నిర్మూలము జేయును. పీనసరోగముల రానివ్వదు. మెదడును బలము కలుగజేయును. కర్ణరోగములను నశింపజేయును. కండ్లను చలువజేయును. అపస్మారగముల దూరము జేయును. తలనరములకు బలమునిచ్చును నేత్రరోగములకు హితము మూర్ఛలను బోగొట్టును. తల చుండును బోనణచును. వెంట్రుకలను నెరయకుండ జేయును. వెంట్రుకలను పట్టుకుంచునటె బెంచును. నెరసిన వెంట్రుకలను నలుపుజేయును. యోచన జేయువారికి మిక్కిలి హితకరము. మాడుపోట్లను నిర్మూలము జేయును. విద్యార్థులకు సర్వదా హితము. చర్మరోగులకు మంచిజేయును. తల మంటలను మాన్పును. అధికనిద్రను తగ్గించును. నిద్రలేమిని బోగొట్టును. దీని గుణములు అనుభవజ్ఞులకు దెలియును.

వెల బుడ్డి 1-క్కి ర్రు 1—0—0. ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము. క్యాటలాగు ఉచితము.

తంతి విలాసము. పండిత్ మదరాసు.

ఆయుర్వేదాశ్రమం, 41, ఆచార్ప్పన్ వీధి, జి. టి. మదరాసు.



**Reg. No. M. 1094.**

The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.


**To M. R. Ry.** **V. P.** *Rs.*